క్లుప్తంగా

17న మండల సమావేశం

కొండపి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 17న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అన్ని శాఖలతో సమీక్షించి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తామన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికతో సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కూలీలందరికీ పని కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభాకర్‌శర్మ

పీసీపల్లి: కూలీలందరికీ పని కల్పించాలని ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ అన్నారు. మండల పరిధిలోని పెదయిలవలపాడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల దగ్గర కనీస వసతులు నీరు, నీడ కల్పించాలని సూచించారు. ప్రతికూలికి కనీస వేతనం పడేలా పనులు కల్పించాలని ఆయన అన్నారు

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న గ్రామ సంఘాల వీఓఏలు

హనుమంతునిపాడు: వీఓఏల సమస్యలు పరిష్కరించి నెలకు రూ.26,000 వేతనం ఇవ్వాలని కోరుతూ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం ఏపీఓ రజనీకుమారికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సంఘాల అధ్యక్ష కార్యదర్శి మాట్లాడుతూ రాణి మాట్లాడుతు వెలుగు వీఓఏల కాల పరిమితి సర్క్యులర్‌రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గ్రామ సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాల తనిఖీ



చిలంకూరులో వ్యవసాయ యంత్ర పరికరాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఏఓ

పామూరు: మండలంలోని కస్టమ్ హైరింగ్ సెంటర్ల పరిధిలోని వ్యవసాయ పరికరాలను సోమవారం ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఓ కె.శివ నాగప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన గ్రూపుల రిజిస్టర్లు, వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లను పరిశీలించారు. రుణాల వసూళ్లపై సభ్యులపై చర్చించారు. రుణ చెల్లింపు సక్రమంగా లేని గ్రూపులకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయితీపై ఇచ్చిన ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని, కార్యక్రమంలో ఏఓ కంచం రాధ, వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



కొండపి, కట్టావారిపాలెం మధ్య మట్టి లోడుతో వెలుతున్న ట్రాక్టర్

కొండపి: మండల కేంద్రమైన కొండపి పంచాయతీలో అక్రమ మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కొండపి పంచాయతీలోని కట్టవారిపాలెం చెరువు నుంచి జేసీబీల సాయంతో అక్రమార్కులు మట్టిని కొల్లగొడుతున్నారు. సాక్షిలో వెలువడిన కథనంతో అప్రమత్తమైన అక్రమార్కులు కొండపి నుంచి కాకుండా కట్టవారిపాలెం నుంచి మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అక్రమ మట్టి రవాణా జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అక్రమ మట్టి రవాణాకు అధికారులు సహకరిస్తున్నారని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. మట్టిని ఇంటి మెరకలకని అనుమతులు తీసుకొని వెంచర్లకు తరలిస్తున్నారని, ఇప్పటికైనా అక్రమ మట్టి రవాణాను అడ్డుకొని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఊరూరా బెల్టు జోరు..!

- ఒక్కో గ్రామంలో మూడు నుంచి నాలుగు బెల్టుషాపులు ఏర్పాటు
- గతంలో ఎన్నడూ లేని విధంగా బరితెగించిన మద్యం మాఫియా
- మామూళ్ల మత్తులో బెల్టుషాపులను పట్టించుకోని అధికారులు
- బహిరంగంగా ఆటోల్లో తీసుకువచ్చి బెల్టుషాపులకు మద్యం సరఫరా



సీతారాంపురంలో బెల్టు షాపుల వద్ద ఆటోలో నుంచి దింపుకుంటున్న మద్యం బాటిళ్లు



బెల్టుషాపులకు మద్యం సరఫరా చేసే ఆటో

హనుమంతునిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం ఏరులై పారుతోంది. మంచినీరు అందని గ్రామాలైతే ఉన్నాయి గానీ, మద్యం అందని గ్రామాలు లేవంటే పరిస్థితి ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు. మండలంలో హనుమంతునిపాడు, వేములపాడులలో లైసెన్సుడ్ మద్యం దుకాణాలు ఉన్నాయి. అయితే ఈ మద్యం దుకాణాలకు అనుబంధంగా ప్రతి గ్రామంలో రెండు నుంచి నాలుగు బెల్టుషాపులు వెలిశాయి. సీతారాంపురంలో నాలుగు, కూటాగుండ్లలో మూడు, ముప్పళ్లపాడులో మూడు, నందనవనంలో నాలుగు, పెద్దగొల్లపల్లిలో రెండు, వాలిచర్లలో రెండు, నారాయిపల్లిలో మూడు..ఇలా ప్రతి గ్రామంలోనూ బెల్టుషాపులు వెలిశాయి. మద్యం దుకాణదారులే ఆటోల్లో తీసుకువచ్చి బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయాన్నే మద్యం దుకాణాల నుంచి ప్రారంభమయ్యే ఆటోలు ప్రతి గ్రామంలోని బెల్టుషాపులకు సరఫరా చేస్తున్నారు. గ్రామాల్లోని బెల్టుషాపుల్లో బాటిల్‌కు రూ.50 నుంచి రూ.70 అదనంగా విక్రయిస్తున్నారు.

తిలా పాపం తలా పిడికెడు

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు బెల్టుషాపుల ద్వారా వచ్చే ఆదాయంలో పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు వాటాలు పంచుకుంటున్నారు. పోలీసులకు బాటిల్‌కు రూ.10 చొప్పున, ఎక్సైజ్ అధికారులకు ఒక్కో దుకాణం నుంచి నెలకు రూ.5 వేలకు పైగానే వసూలు చేస్తున్నారు. గతంలో గ్రామాల్లో బెల్టుషాపు గుట్టుచప్పుడు కాకుండా ఉండేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బెల్టుషాపులను బార్లా తెరిచారు. అధికారం అండతో పోలీసులు, ఎక్సైజ్ శాఖాధికారుల కనుసన్నల్లోనే బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. రేయింబవళ్లు మద్యం గ్రామాల్లో అందుబాటు ఉండటంతో తాము తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని మహిళలు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపారని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం డోర్ డెలివరీ చేస్తూ మా కుటుంబాలను నాశనం చేస్తున్నారని మహిళలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టుషాపులను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా లోకం సిగ్గుపడేలా పోలీసుల తీరు



కనిగిరిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు

హనుమంతునిపాడు(కనిగిరిరూరల్): మహిళా లోకం సిగ్గుపడేలా పోలీసుల తీరు ఉందని నేతలు మండిపడ్డారు. మహిళలపై పోలీసుల తీరును నిరసిస్తూ స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నేతలు నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కటికల వెంకటరత్నం మాట్లాడుతూ మహిళలపై కొందరు పోలీసులు ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరు గ్రామ ఎంపీటీసీ దళిత మహిళ వలపర్ల కల్పనని అర్ధరాత్రి చట్ట వ్యతిరేకమైన చర్యలతో మహిళా అనే గౌరవం లేకుండా అరెస్టు చేయడం దారుణమన్నారు. పోలీసులు అరెస్టు చేయటం దారుమని ప్రశ్నించారు మహిళలపై దౌర్జన్యాలకు సీఎం బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా మహిళా నేతలు పులి శాంతి, తమ్మినేని సుజాత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ నేతలు, మహిళలపై పోలీసులను ఉసిగొల్పుతున్నారని దుయ్యబట్టారు.. రాష్ట్రంలో మహిళల పట్ల కొందరు పోలీసులు సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్నారన్నారు. మాజీ మంత్రి విడదల రజిని పట్ల సీఐ సుబ్బానాయుడు ప్రవర్తించిన తీరు అమానుషం, అమానవీయమని, మహిళా లోకమే సిగ్గుపడేలా ఉందని ఇది చాలా బాధాకరం అని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గం ఎస్సీ విభాగం అధ్యక్షుడు గూడూరి అనిల్ కుమార్ మాట్లాడుతూ దళిత ఎంపీటీసీ కల్పన, బీసీ మాజీ మంత్రి విడదల రజిని విషయంలో పోలీసుల వ్యవహరించిన తీరు దారుణమన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం నశించాలని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, సూరసాని మోహన్ రెడ్డి, పులి శాంతి, తమ్మినేని సుజాత, గాంధ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, సిరప గోవర్ధన్ రెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, రాచపూడి మాణిక్యాలరావు, షేక్ జిలానీ, యర్రబల్లి దేవరాజు, తాతపూడి నాని, అన్నపూర్ణ, షకీలా, రాజేశ్వరి, పలుకూరి భాస్కర్, అత్యాల ఇసాక్, బక్క భాగ్యరాజు, యెహోశివా, విజయరామరాజు, ఖాసీం, మున్నా, దాసరి మాల్యాద్రి, ముక్కు వేణుగోపాల్ రెడ్డి, రహిమాన్, కరీముల్లా, కాసుల బాలయ్య, నెహెమియా, జైపాల్, నాని, షద్రక్, తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి..అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ

హనుమంతునిపాడు(కనిగిరిరూరల్): కనిగిరి మండలం బడుగులేరు పంచాయతీ పట్టాభిరామాపురం ఎస్సీ కాలనీకి చెందిన మర్రి ఆనోక్, పాలిపోగు పోలయ్యలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ సోమవారం గ్రామానికి వెళ్లి మృతదేహాలకు నివాళులర్పించారు. కుటుంబాలను పరామర్శించి ధైర్యంగా ఉండండని, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, నాయకులు ఆవుల భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ పాపనబోయిన కోటమ్మ, నాగేశ్వరావు, సైకం ఏడుకొండలరెడ్డి, తిరుపతరెడ్డి, స్టీఫెన్, బి.ఇసాక్, కె. ఏసుదాసు, ఆరోన్, యేహన్, వెంకటేశ్వర్లు, బాలగురవయ్య, సుబ్బయ్య, చిన్న గురవయ్య, కాకర్ల వెంకటేశ్వర్లు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

సింగరాయకొండ: మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ డి.జయమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 38 మందికి అవకాశం ఉందని, అర్హులు ఈ నెల 25వ తేదీ లోగా దరకాస్తు చేసుకోవాలన్నారు. 21 నుంచి 50 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులు పంచాయతీల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

టైలరింగ్ శిక్షణకు విధిగా హాజరుకావాలి



కుట్టు శిక్షణాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య

పామూరు: టైలరింగ్‌లో శిక్షణ పొందే మహిళలు విధిగా నిర్దేశిత సమయాల్లో శిక్షణా కేంద్రానికి విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. స్థానిక శ్రీశక్తి భవన్‌లో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు టైలరింగ్ చేర్చుకుని స్వతహాగా ఆర్థికంగా ఎదిగేందుకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ అందిస్తోందన్నారు. శిక్షణా కేంద్రంలో మొత్తం 144 మంది రెండు బ్యాచ్‌లుగా శిక్షణ పొందుతున్నారు. శిక్షణ కార్యక్రమాలను ట్రైనర్స్ లక్ష్మి, ఖాజాబీలు పర్యవేక్షిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ ఎం.స్రవంతి పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కొండపి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 35 మంది హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయసంవత్సరం పరీక్షలకు 13 మందికి గాను 13 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. డిపార్టుమెంటల్ అధికారిగా రమణారెడ్డి విధులు నిర్వహించారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2.16 లక్షలు



వెండి శఠగోపురాన్ని ఆలయ చైర్మన్‌కు అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.2,16,060 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్ నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.81,280, లడ్డు ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.29,940, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.68,660, పంచామృతాభిషేకానికి విరాళంగా రూ.22,064, మహాప్రాకార నిర్మాణానికి రూ.11,116, ఇతర విరాళాలు రూ.3 వేలు వచ్చినట్లు పేర్కొన్నారు. మురుగమ్మి గ్రామానికి చెందిన గోదురు ఆదినారాయణ, వినితలు రూ.13,600 విలువైన వెండి శఠగోపురాన్ని ఆలయ చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణకు అందజేశారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, పలువురు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



పి.వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం తహసీల్దార్‌గా పొన్నరుసు వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీచేయగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్నారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన డి.మంజునాథరెడ్డి ఇటీవల బదిలీపై యర్రగొండపాలెంకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారం వేగవంతం చేస్తానన్నారు.

పోరంబోకు భూములు ఆక్రమణకు గురికాకుండా చూడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మర్రిపూడి: అక్రమార్కుల చెర నుంచి మేతభూమిని విముక్తి చేయాలని మండలంలోని సన్నమూరు గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ జ్వాలా నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని సన్నమూరులో సర్వే నంబర్ 52-2, 72-2, 73-3లో సుమారు 64 ఎకరాల భూమిని కందుకూరు నియోజకవర్గం మాచవరం గ్రామానికి చెందిన గాదె శ్రీనివాసరెడ్డి, గాదె లక్ష్మీ ప్రసన్న, చిడిపూడి రమణారెడ్డిలు కొనుగోలు చేశారు. అయితే ఆ భూమి పక్కనే సర్వే నంబర్ 49, 50, 52, 53, 71లో పశువులు మేత, వాగు, దారి పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిని శ్రీనివాసరెడ్డి, లక్ష్మీప్రసన్న, రమణారెడ్డి ఆక్రమించుకుని పైర్లు సైతం వేసి అనుభవిస్తూ తాజాగా పోరంబోకు భూమిలో ఫెన్సింగ్ రాళ్లు వేస్తున్నారు. విషయాన్ని గ్రామస్తులు తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. అక్రమార్కుల నుంచి మా భూములు కాపాడాలని సన్నమూరు గ్రామానికి చెందిన జి.ఏసు, కె.రాములు, బి.బెన్నియా, కె.సీతారామయ్య, జె.ప్రసాదు, యూ ముసలయ్య, కె. లక్ష్మణ్, ఎస్ సుబ్బారావు, అంబటి బుజ్జి, యూ శ్రీనివాసులు, బి.లక్ష్మీ నరసమ్మ, బీ బెన్నీ తదితరులు వినతిపత్రం ద్వార తెలియజేశారు. రెవిన్యూ అధికారులను పంపి విచారణ చేపడతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను విక్రయిస్తున్న సిబ్బంది

కొండపి: ప్రకృతి వ్యవసాయంలో సాగుచేసిన పంటలకు మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలు పొందవచ్చని యూనిట్ ఇన్చార్జిలు రంజిత్, మాధవ అన్నారు. మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను విక్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు ప్రస్తుతం మార్కెట్లో ఎక్కువగా డిమాండ్ ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి పంటల సాగు చేయడానికి ముందుకు రావాలన్నారు. ప్రస్తుత సమాజంలో సహజసిద్ధంగా పండించిన ఆహార ఉత్పత్తులను తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సూచించారు. ఐసీఆర్పీలు జోత్స్న, గౌతమి, విజయలక్ష్మి, ఏడుకొండలు, మాలకొండయ్య, తిరుమల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడ సేవా ఉత్సవం



చెన్నకేశవ స్వామికి పల్లకిపై ఊరేగింపు



గర్భగుడిలో పూజలు చేస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండలంలోని చిన్న గొల్లపల్లి నాగులవేటున వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి గరుడ సేవా ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి కొనతాళ్ల వద్ద పూజలు నిర్వహించారు. జల్లి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం పోతురాజులకు పట్టాలు కట్టారు. చెక్కవారి వంశస్తులు ప్రత్యేక పొంగళ్లు పొంగించి స్వామికి సమర్పించారు. అనంతరం పోతురాజుల వీర కేకల నడుమ వేములపాడు, వాలిచర్ల, గాయంవారిపల్లి, చీరాల, కావలి చెక్క వంశస్తులు ప్రత్యేక కత్తి గరుడ సేవలు నిర్వహించారు. అనంతరం నీలకంఠాపురం, ఎలికవారిపల్లి పాలెగాళ్లు కత్తి సేవలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చెక్కావారు స్వామి పల్లకిపై ఊరేగించి పూజలు నిర్వహించారు. పోతురాజు, అంకాలమ్మ తల్లి వద్ద పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కొనతాళ్లవద్ద పూజలు చేస్తున్న భక్తులు

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



చెన్నపునాయునిపల్లెలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య

సీఎస్‌పురం(పామూరు): ప్రజాసమస్యలపై వచ్చిన అర్జీలను సచివాలయ సిబ్బంది త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీదారులను పదే పదే కార్యాలయంకు తిప్పుకోవద్దని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని చెన్నపునాయునిపల్లె సచివాలయాన్ని సోమవారం ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలపై సిబ్బందితో చర్చించారు. అర్హులందరికీ పథకాలు వచ్చేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండలంలోని మైలుచర్ల గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో చర్చించారు. రేషన్‌కార్డులు లేనివారు తక్షణం దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డులు లేనివారు కార్డులు పొందాలని, తప్పులు, సవరణలు ఉంటే ప్రత్యేక క్యాంపులు పెట్టినప్పుడు సరిచేసుకోవాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పామూరు:

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వింజమూరుకు చెందిన సీనియర్ పిరమిడ్‌మాస్టర్ రవిచంద్ర అన్నారు. స్థానిక పిరమిడ్ ధ్యాన కేంద్రంలో సోమవారం పౌర్ణమి ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పిరమిడ్ మాస్టర్ రవిచంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం ధ్యానం చేయాలని సూచించారు. మాంసాహారానికి దూరంగా ఉండాలని, శాఖాహారమే ఆరోగ్యదాయకమని వివరించారు. స్థానిక పిరమిడ్ ధ్యాన కేంద్రంనుండి పామూరు ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

50 శాతం రాయితీపై దాణా పంపిణీ

జరుగుమల్లి(సింగరాయకొండ) :50శాతం రాయితీపై పశుపోషకులకు దాణా పంపిణీ చేస్తున్నట్లు పశు వైద్యాధికారి శ్రావణి అన్నారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో సోమవారం రైతులకు 50 శాతం రాయితీతో దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో వీటి ద్వారా పాల దిగుబడిలో వెన్నశాతం తగ్గకుండా ఉంటుందన్నారు. మండలానికి 6,500 కేజీలు మంజూరు చేశామన్నారు. దాణా కావాల్సిన రైతులు జరుగుమల్లి కామేపల్లి వైద్యశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అశోక్, పశుపోషకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సింగరాయకొండ: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండల కేంద్రంలోని పాత కలికివాయ రోడ్డులో జరిగింది. ఎస్సై బి. మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని పాత కలికివాయి రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి (40ఏ)మృతి చెందాడని, స్థానికులు సమాచారం అందించారన్నారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించామన్నారు. చనిపోయిన వ్యక్తి మద్యం సేవించి మృతి చెందినట్లు అనుమానిస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.